

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ముంపు ప్రాంతాలైన సప్తగిరికాలనీలో శనివారం భారీ వర్షంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పర్యటించారు. సప్తగిరికాలనీ, జ్యోతిరావుపూలే పాఠశాల ప్రాంతాల్లో పర్యటించిన ఆయన వరద కాలువలను పరిశీలించారు. ముంపు ప్రాంతాల్లో వరద ప్రభావాన్ని నివారించేందుకు టీయూఎఫ్ఐడీసీ పథకంలో నాలాలను ఆధునీకరించామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వరదతో సప్తగిరికాలనీ, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యేవని, పడవల్లో జనాలను బయటకు తీసుకువచ్చే పరిస్థితి ఉండేదన్నారు. వరద ముప్పును నివారించేందుకు కాలువలను ఆధునీకరించామని, ఇండ్లలోకి వరద నీరు రాకుండా చర్యలు చేపట్టామన్నారు. నాలాలను పరిశీలించారు. స్థానికులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, వరద ముంపు కూడా ఈ ప్రాంతాలకు ఉండదన్నారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. ఇంటింటా చెత్త సేకరణ జరుపాలని, ప్రజలు చెత్తను రిక్షాలకు ఇచ్చేలా ప్రోత్సహించాలన్నారు. గడ్డం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

- సీజన్‌లో తరచూ షట్‌డౌన్‌పై అనుమానాలు
- రాష్ట్ర వాటా కోసం పట్టుబడుతున్న ప్రభుత్వం
- పైప్‌లైన్ల పనుల నాణ్యతపై సీబీఐ విచారణ కోరుతున్న ఎమ్మెల్యే



ఆర్ఎఫ్‌సీఎల్ షట్ డౌన్‌పై ఆరా!

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) తరచూ షట్ డౌన్ అవుతుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. షట్ డౌన్ ఎందుకు అవుతుందనే విషయమై ప్రభుత్వం నిఘా వర్గాల ద్వారా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ప్లాంట్ ద్వారా ఈ నెలాఖరు వరకు రాష్ట్రానికి 65 వేల టన్నుల యూరి యా రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 20 వేల టన్నులు మాత్రమే సరఫరా అయ్యింది. జూలై నుంచి వరి సాగవుతున్న సమయంలోనే ఒక్కసారిగా యూరియా కొరత ఏర్పడింది. ఇందుకు కారణం ఆర్ఎఫ్‌సీఎల్ తరచూ షట్‌డౌన్ అవుతుండడమేనని తెలుస్తున్నది. ఈ ఏడాది మే 8 నుంచి జూన్ 15 వరకు, జూలై 16 నుంచి ఆగస్టు 4 వరకు ఉత్పత్తి నిలిచిపోయింది. మళ్లీ ఆగస్టు 14న అమ్మోనియా లీకేజీతో ప్లాంట్ షట్‌డౌన్ అయ్యింది. ఈ వరుస వైఫల్యాలతో తెలంగాణకు లక్ష టన్నులకు పైగా యూరియా సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఈ నెలలో 65 వేల టన్ను లు సరఫరా జరగాల్సి ఉంది. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు గల కారణాలపై రాష్ట్ర ప్రభుత్వం నిఘా వర్గాల ద్వారా ఆరా తీస్తున్నది. కావాలనే పరిశ్రమను షట్ డౌన్ చేస్తున్నారా, సాంకేతిక కారణాల వల్ల షట్ డౌన్ అవుతున్నదా, అమ్మోనియా లీక్‌తోనే షట్‌డౌన్ అవుతున్నదా, పరిశ్రమలో త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యంతోనే తరచూ లీకేజీలు తలెత్తుతున్నాయా, రాజకీయ కుట్రల కారణంగా షట్ డౌన్ అవుతున్నదా అనే కోణాలపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం. రామగుండంలో మూతపడిన ఎఫ్‌సీఐని నేషనల్ ఫెర్టిలైజర్స్ ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఎఫ్‌సీఐ, డెన్మార్క్‌కు చెందిన హాలర్ టాప్స్ భాగస్వామ్యంతో ఆర్ఎఫ్‌సీఎల్ పునరుద్ధరించారు. యేటా 12 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి లక్ష్యంతో ప్రాజెక్టును నిర్మించారు. 2021 నుంచి ఈ ప్రాజెక్టులో ఉత్పత్తి ప్రారంభమైంది. ఇందులో తెలంగాణకే 45 శాతం యూరియా సరఫరా చేసే విధంగా కేంద్రం ప్రణాళిక చేసింది. అయితే ఈ ఏడాది లక్ష్యం మేరకు యూరియా సరఫరా కావడం

(మిగతా 8వ పేజీలో)



ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

అంబులెన్స్‌ల తనిఖీ



అంబులెన్స్ సిబ్బందితో డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆవరణలో ఉన్న 108 వాహనాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి శనివారం తనిఖీ చేశారు. వాహనాల పనితీరు, రికార్డులను పరిశీలించారు. అత్యవసర వేళల్లో ఆపదలో ఉన్న వారిని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించేలా వాహనాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోఆర్డినేటర్ కుమారస్వామి, సిబ్బంది చాగంటి నరేష్, రాజ్ కుమార్, దాసారం సంపత్, కుమారస్వామి, కారంగుల సంపత్, పూరెల్ల అఖిల్, సంపత్ యాదవ్ పాల్గొన్నారు.

అడుగుకో గుంత...



కుర్మపల్లి వద్ద ఏర్పడిన గుంతలు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మపల్లి గ్రామానికి వెళ్లేందుకు రహదారిపై అడుగుకో గుంతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధిక లోడ్‌లతో వెళ్తున్న భారీ వాహనాలతో పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. అటు వైపు ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ధర్మారం ఎక్స్ రోడ్ నుంచి పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు ఈ దారి గుండా రాకపోకలు సాగుతున్నాయి. అధిక లోడ్‌లతో వాహనాలు వెళ్తుండటంతో రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గుంతల్లో పడి ప్రమాదం జరుగుతుందోనని ద్విచక్ర వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

రామగుండంలో దంచికొట్టిన వాన



జలమయమైన ఫైవింక్లయిన్ రహదారి

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 11గంటల వరకు భారీ వర్షం కురిసింది. రామగుండంలో 8సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా పట్టణంలోని ప్రధాన నాలాలు పొంగి పొర్లాయి. గోదావరిఖని ఫైవింక్లయిన్, 2ఇంక్లైన్ మోరీలు నీట మునగగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఫైవింక్లయిన్ వంతెన దాటడానికి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం సింగరేణి గనులకు వెళ్లే కార్మికులు అవస్థలు పడ్డారు. మల్లికార్జున్‌నగర్, ఫైవింక్లయిన్ ప్రధాన నాలాలు ఉప్పొంగాయి. మార్కండేయకాలనీ లోని బీసీ హాస్టల్‌లోని రోడ్లు జలమయం కాగా ఇండ్ల ముందున్న వాహనాలు నీటిలో మునిగాయి. కార్పొరేషన్‌లోని పలు ఏరియాల్లో రోడ్లన్నీ జలమయంగా మారాయి. భారీ వర్షంతో ఇండ్ల నుంచి ప్రజలెవరూ బయటకు రాలేదు.

విలోచవరం వంతెనపై వరద నీరు

మంథనిరూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మంథని మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మంథని నుంచి విలోచవరం వెళ్లే ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహిస్తోంది. శనివారం పోలీసులు గ్రామంలో పర్యటించి రహదారిని మూసివేశారు. విలోచవరం సమీపంలోని నాగారం, గుంజపడుగు, విలోచవరంలోని కొత్త చెరువులలోకి నీరు చేరి అలుగు పడటంతో ఆ వరద నీరు పరికి వాగులోకి చేరడంతో వాగులోని నీరు వంతెనపైకి రావడంతో రహదారి మునిగిపోయింది. దీంతో గ్రామానికి చేరుకున్న పోలీసులు గ్రామస్థులతో మాట్లాడి రహదారిని మూసివేస్తున్నట్లు హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. వర్షాల కారణంగా వరదలు వచ్చే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. దీంతో ప్రజలు తమ రాకపోకలను సమీపంలోని పోతారం, నాగారం, ఉప్పట్ల, గుంజపడుగు మీదుగా సాగిస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పై నుంచి వరద నీరు వస్తుండటంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరద నీరు కిందకు వదలుతున్నందున సిరిపురం వద్ద సుందిళ్ల బ్యారేజీ గేట్లు ఎత్తి ఉండటం వలన నది పరివాహక ప్రాంతంలోకి ఏ సమయంలోనైనా వరద నీరు వచ్చే అవకాశం ఉందని బ్యారేజీ అధికారులు ప్రకటించారు. రైతులు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. బ్యారేజీకి దిగువన గోదావరి పరివాహక ప్రాంతం వెంట ఉన్న సిరిపురం, ఉప్పట్ల, విలోచవరం, పోతారం, గ్రామల రైతులు ముందస్తుగా గోదావరి నదిలో రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లు, తీగలను తొలిగిస్తున్నారు.



మంథని మండలం విలోచవరం రహదారి పైనుంచి పారుతున్న వరద

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు పోటెత్తుతున్న వరద

7

మంథనిలో గంజాయి దందా..



- మత్తుకు ఆకర్షితులవుతున్న మైనర్లు, స్టూడెంట్స్, యువత
- విష వలయంలో చిక్కుకుంటున్న బాలురు..
- యువతే టార్గెట్‌గా కోడ్ లాంగ్వేజ్‌లో విక్రయాలు..
- రహస్య ప్రాంతాల్లో గంజాయి మొక్కల సాగు
- కిలోకు రూ. 10 వేలకు పైగా డిమాండ్

మంథని, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రాంతంలో జోరుగా గంజాయి దందా కొనసాగుతోంది. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా యువత, విద్యార్థులు గంజాయికి బానిసలవుతున్నారు. పాఠశాల స్థాయి నుంచే కొందరు బాలురు గంజాయి కిక్కుకు బానిసలవుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్కసారి దమ్ము కొడితే కొన్ని గంట పాటు మత్తులో విహరిస్తారు. మత్తుకు అలవాటు పడిన వారు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈనెల 11న మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్ శివారులోని గాడుదులగండి గుట్ట సమీపంలో గంజాయి రవాణా చేస్తూ పోలీసుకు పట్టుబడ్డారు. మంథనిలోని పోచమ్మవాడకు చెందిన బండారి అభిషేక్ అలియాస్ అంజీ, సూరయ్యపల్లికి చెందిన కోరవేన రవిసాగర్, ఖానాపూర్‌కు చెందిన పుట్ట అలియాస్ కొవ్వూరి అజయ్‌కుమార్‌ల తోపాటు మరో ఇద్దరు మైనర్లను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి మహరాష్ట్రలోని సిర్వోంచ ప్రాంతంలో కొనుగోలు చేసిన 2.23 కిలోల ఎండు గంజాయి, బైక్, రెండు కత్తులు, మూడు సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా, భూపాలపల్లి జిల్లాలోని అటవీ గ్రామాల నుంచి, డివిజన్‌లోని పలు మారుమూల గ్రామాల్లో కొందరు చాటుమాటుగా మిరప, పత్తి, బంతి పంటల సాగులో పండిస్తున్నారు.

ఎవరికి అనుమానం రాకుండా విక్రయదారులు, వినియోగదారులు గంజాయిని ఇక్కడ మాల్, వీడ్, శీలవతి, సోర్కింగ్.. లాంటి కోడ్ బాషల్లో పిలుస్తున్నారు. స్థానిక గంజాయి ప్రియులు మాల్, శీలవతిగా, స్టూడెంట్, యువకులు వీడ్, సోర్కింగ్ అంటూ.. వివిధ రకాల కోడ్ లాంగ్వేజ్‌ను ఉపయోగిస్తున్నారు. ప్యూర్ గంజాయిని శీలవతిగా పేర్కొంటున్నారు. ఇది కిలోకు రూ. 25 వేల పైనే ధర పలుకుతుందని, మిగతా రెండో రకం గంజాయికి రూ.10 వేలకు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. పట్టణంలోని పలు వాడల్లో యవకులు, స్టూడెంట్స్ గంజాయి మత్తుకు ఆకర్షితులవుతున్నారు.

మద్యం సేవిస్తే ఇంట్లో తెలుస్తుందని యువత, విద్యార్థులు గంజాయి తాగి కొన్ని గంటల పాటు మత్తుతో కాలక్షేపం చేస్తున్నారు. రోజు 250 మందికి పైగా గంజాయి ప్రియులు జన సంచారం లేని ప్రాంతాల్లో గంజాయిని సిగరేట్స్‌లో కలుపుకొని దమ్ము కొడుతున్నారు. కొందరూ గంజాయి విక్రయదారులు స్థానిక యువత తోపాటు మంథని సమీపంలో ఉన్న ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీ స్టూడెంట్స్‌ను టార్గెట్‌గా చేసుకొని తమ దందాను విస్తరించి లక్షల్లో సొమ్ము చేసుకోవటానికి యత్నిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఇంజనీరింగ్ స్టూడెంట్స్‌లో కొందరిని గంజాయి మత్తులోకి దింపినట్లు సమాచారం. వారి ద్వారా అక్కడ గంజాయిని విక్రయించాలని చూస్తున్నట్లు తెలిసింది. పాత ఇండ్లు, శివారు పల్లెల్లోని మిరప, పత్తి చేలల్లో ఎవరికి అనుమానం రాకుండా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నారు. సాగు అనంతరం వీటిని తమ ఇండ్లలోనే ఆర బెట్టి ఆకులను, చిన్న కొమ్ములను చూర్ణం చేసి విక్రయిస్తున్నారు. రెండేళ్ళ కాలంలోనే పదు సంఖ్యల్లో గంజాయి కేసులు అయ్యా యంటే వీటిని బట్టి చూస్తే గంజాయి విష వలయం ఇక్కడి యువత, స్టూడెంట్స్ చుట్టూ రోజురోజుకి ఉచ్చు బిగుసుకు పోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా పోలీస్ అధికారులు గంజాయి సాగు, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా పెట్టాలి

మడత రమేష్, గోదావరిఖని ఏసీపీ

పిల్లల వ్యవహార శైలిపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా పెట్టాలి. చెడు మార్గంలో వెళ్ళే విషయాన్ని ముందే పసిగడితే వారిలో మార్పు తీసుకు రావచ్చు. తల్లిదండ్రులు వారిని కంట్రో ల్ చేయడం సాధ్యం కాకుంటే మాకు సమాచారం ఇస్తే వారిలో మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తాం. కేసులకు దూ రంగా ఉంటే పిల్లల భవిష్యత్ బాగు టుంది. గంజాయి రవాణా, క్రయ, విక్రయాలు జరిపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నాం. గంజా యి రవాణా, ఇతర మత్తు పదార్థాల పై పూర్తి స్థాయిలో నిఘా పెట్టాం.



గంజాయి నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు (ఫైల్)

జాతీయ పతాకాన్ని అవమానించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ పతాకాన్ని అవమానించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు పెద్దపల్లి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి చింతలవాడలో నయ్యార్ చెప్పులు వేసుకుని జాతీయ జెండాను ఎగురవేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జాతీయ జెండాను అవమామించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వేల్పుల రమేష్, కావేటి రాజగోపాల్, పోల్సాని సంపత్ రావు, గుడ్ల సతీష్, తదితరులు ఉన్నారు.

మెడికల్ బోర్డు లోపాలను సరిచేయాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

గోదావరిఖని, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మెడికల్ బోర్డులో జరిగిన అవకతవకలను సరిచేసి అనారోగ్యంతో ఉన్న వాళ్లను అన్‌ఫిట్ చేయాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) డిమాండ్ చేస్తూ శనివారం యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ నరేష్ ఆర్‌జీ-1 జీఎంకు వినతి పత్రం అందజేశారు. నరేష్ మాట్లాడుతూ 55 మంది కార్మికులు దీర్ఘకాలిక జబ్బులతో కంపెనీ హాస్పిటల్‌లో వైద్యం తీసుకుంటూ నిత్యం మందులతో జీవితం గడుపుతున్నారని, జూలై 31న మెడికల్ బోర్డుకు హాజరైన వారిలో 5గురిని అన్‌ఫిట్ చేసి మిగిలిన వారిని తిరస్కరించారన్నారు. బోర్డు ఫిట్ చేసిన వారిలో గుండె జబ్బులు, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, పక్షవాతం తదితర అనేక రకాలైన జబ్బులతో విధులకు హాజరుకాలేని కార్మికులను సైతం విధులకు హాజరు కావాలని చెప్పడం మానవత్వానికి వ్యతిరేకమైనదన్నారు. కార్మికులను కుదించాలనే యాజమాన్యం కుట్రలో భాగంగా కార్మికులను మానసిక, శారీరక వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసిన వారిలో 32మందిని ఫిట్ చేస్తూ బోర్డు నిర్ణయం తీసుకొందని, అందులో 17మందిని తమ డిసిగ్నేషన్లకు అన్‌ఫిట్ చేసి తక్కువ స్థాయి డిజైనేషన్‌కు మార్చారని, ఇది కంపెనీ అమలులో ఉన్న ఒప్పందాల ప్రకారం సూటబుల్ జాబ్ ఇవ్వాల్సి ఉండగా సూపర్వైజర్లను జనరల్ మజ్దూర్లుగా ఫిట్ చేయడం గత ఒప్పందాలకు వ్యతిరేకమైనదన్నారు. జూలై 31 నాటి బోర్డు నిర్ణయాన్ని పునః పరిశీలన చేయాలని, వివిధ రకాల జబ్బులతో డ్యూటీ చేయలేక సర్వీస్ నుంచి అన్‌ఫిట్ చేయాలని, దరఖాస్తు చేసిన కార్మికులందరిని అన్‌ఫిట్ చేసి వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఐఎఫ్‌టీయూ నాయకులు ఈదునూరి రామకృష్ణ, నాయకులు ఐ రాజేశం, ఎస్ ప్రసాద్, వీ మొండయ్య, ఏ చంద్రయ్య, గుండేటి మల్లేశం, చింతల శేఖర్, ఎన్‌సీ బాబు, అవినాష్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



యజమానికి మొబైల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌కు చెందిన బలుసుల వంశీ ఇటీవల ఇరుకుల్లలో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు సీఈఐఆర్‌ను ఉపయోగించి ఫోన్ ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శనివారం కరీంనగర్ రూరల్ ఠాణాలో సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను అందజేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కోల్‌సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఫైవింక్లయిన్ ఈద్గా వద్ద చెట్ల పొదల్లో పేకాట స్థావరంపై శనివారం వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారైనట్టు ఆయన తెలిపారు. చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి నిర్వహించగా 8మంది పేకాట ఆడుతున్నారని, అందులో ఐదుగురిని అరెస్టు చేయగా, మిగతా ముగ్గురు పరారీలో ఉన్నట్టు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1.06లక్షల నగదు, మూడు సెల్ ఫోన్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

- 75.1 శాతంతో రాష్ట్రంలోనే జగిత్యాల జిల్లా మొదటిస్థానం
- ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిర్మల్, పెద్దపల్లి
- ఆందోళన కలిగిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ గణాంకాలు



ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరుగుతున్న సిజేరియన్లు

జగిత్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిజేరియన్లు అధికంగా జరుగుతున్నాయి. గత జూలై వరకు సిజేరియన్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జగిత్యాల జిల్లా 75.1 శాతంతో మొదటి స్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. నిర్మల్ జిల్లా 74.1 శాతంతో ద్వితీయ స్థానంలో, పెద్దపల్లి 72.7 శాతంతో తృతీయ, హన్మకొండ 72.7 శాతంతో నాల్గవ, కరీంనగర్ 71.3 శాతంతో ఐదో స్థానంలో ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు అంటున్నాయి. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిజేరియన్లు అధికంగా జరిగిన తొలి ఐదు జిల్లాల్లో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్‌లు ఉండడం గమనార్హం.

జగిత్యాలలో అధికం..

జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 7,120 ప్రసవాలు జరగ్గా, అందులో 2,511 సాధారణ, 4,609 సిజేరియన్లు ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 6,451 ప్రసవాలు జరగ్గా, అందులో 2,383 సాధారణ, 4,068 సిజేరియన్లు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,551 ప్రసవాలు జరగ్గా, అందులో 2,327 నార్మల్, 4,224 సిజేరియన్ ప్రసవాలున్నాయి. 2025 ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలల కాలంలో 1,612 ప్రసవాలు జరగ్గా అందులో 422 సహజ ప్రసవాలు, 1,190 సిజేరియన్లు జరిగినట్లు వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో గత మూడు సంవత్సరాల కాలంలో సిజేరియన్లు అధికంగా జరిగాయి.

కారణాలు అనేకం...

సాధారణ ప్రసవం చేయాలంటే కొన్ని గంటల సమయం పడుతుంది. ఈ క్రమంలో గర్భిణి, కడుపులోని బిడ్డ ఆరోగ్య పరిస్థితిని వాకబు చేస్తూ ఉండాలి. దీని కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో నిపుణులైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాల్సి వస్తుండడంతో వారు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సిజేరియన్ వల్ల కలిగే సమస్యలను వివరించి, సాధారణ ప్రసవానికి సిద్ధపడేలా గర్భిణి, కుటుంబ సభ్యులను కౌన్సెలింగ్ చేసే ప్రయత్నం కూడా చేయకపోవడం కారణాలుగా నిలుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులకు పౌష్టికాహారం లేక రక్తహీనత కారణంగా సిజేరియన్లు జరుగుతున్నాయన్న అభిప్రాయాలున్నాయి. కొందరు శుభ ముహూర్తాలు అంటూ సిజేరియన్ చేయిస్తున్నారు. సాధారణ ప్రసవం నొప్పులను తమ కూతురు తట్టుకోలేదని కొందరు తల్లిదండ్రులు ఒత్తిడి చేయిస్తుండడంతో వైద్యులు చేసేదేమీ లేక సిజేరియన్ల వైపు మొగ్గు చూపుతున్నారని అంటున్నారు. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ సిజేరియన్లు అధికంగా జరుగుతుండడంపై ఇటీవల కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్‌లు దృష్టి సారించి ప్రభుత్వ వైద్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సాధారణ ప్రసవాలు పెంపొందించాలని ఆదేశించారు.

డబ్ల్యూహెచ్‌వోమార్గదర్శకాలు ఇలా...

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాల ప్రకారం మొత్తం ప్రసవాల్లో సిజేరియన్లు 10 నుంచి 15 శాతానికి మించకూడదు. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న ప్రసవాల్లో 71.3 శాతం మేర సిజేరియన్లు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. వీటిలో చాలా వరకు అవసరం లేకపోయినా సిజేరియన్లు చేసినట్లు అధికా రులు అనుమానిస్తున్నారు. సాధారణ ప్రసవం చేయడానికి వీల్లేని పరిస్థితుల్లోనే సిజేరియన్లు చేసినట్లు సర్కారు ఆసుపత్రుల వైద్యుల పే ర్కొంటున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు.

సాధారణ ప్రసవాలు పెంచేలా చర్యలు

-డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జగిత్యాల



జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధిక శాతం సిజేరియన్లు జరుగుతున్నట్లుగా గుర్తించాం. జూలైలో రాష్ట్రంలోనే సర్కారు ఆసుపత్రుల్లో సిజేరియన్లలో జగిత్యాల జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. అయితే పరిస్థితిలో మార్పు తీసుకొని రావడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రభుత్వ వైద్యాధికారులతో ఇటీవల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమీక్ష నిర్వహించాం. భవిష్యత్తులో సిజేరియన్లు వీలైనంత వరకు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నాం.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



అంగడి రాజు(ఫైల్)

వెల్గటూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దమ్మన్నపేటకు చెందిన అంగడి రాజు(26) అనే యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. గొల్లపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన అంగడి రాజు జీవితంపై విరక్తిచెంది ఈనెల 14న ఎండపల్లి గ్రామ శివారులో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా మహాసభలు వాయిదా

హుజూరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా 5వ మహాసభలు ఆదివారం జరగాల్సి ఉండగా, భారీవర్షాల దృష్ట్యా వాయిదా వేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి కొప్పుల శంకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి తేదీలు ప్రకటిస్తామని తెలిపారు.

పురుగుల మందు తాగిన యువకుడు

- చికిత్స పొందుతూ మృతి



రాహుల్(ఫైల్)

సైదాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారం గ్రామపంచాయతీ పరిధిలోని బూడిదపల్లి గ్రామానికి చెందిన అమరగొండ రాహుల్(20) అనే యువకుడు పురుగుల మందు తాగగా వరంగల్ ఎంజీఎంలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాహుల్ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో గుంటి చంద్రమౌళి తన వ్యవసాయ బావి వద్ద రాహుల్ ఉన్నాడని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అక్కడికి వెళ్లి చూడగా రాహుల్ పురుగుల మందుతాగి ఉన్నాడు. వెంటనే ద్విచక్రవాహనంపై సింగాపూర్ వరకు అక్కడినుంచి 108లో హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైనచికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. తన కొడుకుకు మూడురోజుల క్రితం జ్వరం రాగా సైదాపూర్‌లోని ఓ ఆర్ఎంపీకి చూపించామని, అతను పరీక్షలు చేసి పస్కలు అయినట్లు తెలిపాడని తల్లి విజయ తెలిపింది. పస్కలు అయిన తనను ఆస్పత్రికి తీసుకపోతలేరని మనస్థాపం చెంది తన కొడుకు రాహుల్ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకొన్నాడని పేర్కొంది. తన కొడుకు మృతిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి తల్లి విజయ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కాగా రాహుల్ తనకు ఎవరిపై కోపం లేదని తనకు జీవి తంపై విరక్తి చెందిందని, తాను సంతోషంగా చనిపో తున్నానని సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు తాగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుజూరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన పంజాల కృష్ణ(40) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన పంజాల కృష్ణ, వనం హరీష్ అనే వ్యక్తికి రూ.25లక్షలు అప్పుగా ఇచ్చాడు. కృష్ణ ఆ డబ్బులు అడిగితే హరీష్ బెదిరించాడు. దీంతో మనస్థాపానికి గురైన కృష్ణ ఈనెల 3న హైస్కూల్ గ్రౌండ్‌లో పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియో తీశాడు. గమనించిన స్థానికులు వెంటనే హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కృష్ణ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు కృష్ణ భార్య తిరుమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

కాలువలో పడి మేకల కాపరి మృతి

ధర్మపురి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ధర్మపురి మండలం దొనూర్ గ్రామానికి చెందిన మానం చంద్రయ్య (59) అనే మేకల కాపరి ప్రమాదవశాత్తు ఎస్ఆర్ఎస్పీ పిల్ల కాలువలో పడి శనివారం మృతి చెందాడు. చంద్రయ్య దొనూర్ గ్రామ శివారులో గల భీమన్న గుట్ట సమీపంలో మేకలు కాస్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో జారి పడి మృతి చెందాడు. మృతుడి భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

దొంగల ముఠా అరెస్ట్

- 12 తులాల బంగారం, కారు, రూ.15వేలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలరూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పలు దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పట్టుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శనివారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. రాయికల్ లలితమాత శివారులోని గుడి సమీపంలో మామిడి తోటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురువ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మండలపల్లికి చెందిన వనం పాపయ్య, టీఆర్‌నగర్‌కు చెందిన వనం రాము, దాసరి రవిగా పోలీసులు గుర్తించారు. ఈ ముఠాకు చెందిన మరో నిందితుడు నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన జగన్నాథం కృష్ణ పరారీలో ఉన్నాడని డీఎస్పీ తెలిపారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో వీరిపై ఇప్పటికే ఆరు కేసులు నమోదైనట్లు గుర్తించారు. నిందితుల నుంచి 12 తులాల బంగారం, రూ.15వేల నగదు, 3సెల్ ఫోన్లు, ఒకకారు స్వాధీనం చేసుకున్నారు. వీరు ఒకముఠాగా ఏర్పడి జగిత్యాల, రాయికల్, మల్యాల, భూపాలపల్లి, భద్రాచలం, పరిసర ప్రాంతాల్లో దోపిడీలు, దొంగతనాలకు పాల్పడినట్లు తేలిందని 30కి పైగా కేసుల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు గుర్తించినట్లు డీఎస్పీతెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన జగిత్యాలరూరల్ సీఐ సుధాకర్, రూరల్ ఎస్సై సధాకర్, రాయికల్ ఎస్ఐ సుధీర్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్, సుమన్‌లను డీఎస్పీ అభినందించి నగదు బహుమతి అందజేశారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్

జ్యోతినగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కలను పెంచుతున్న కేసులో నీలం కార్తిక్(33) అనే నిందితుడిని శవారం ఎన్టీపీసీ పోలీసులు అరెస్టు చేశారు. మేడిపల్లి గ్రామంలో కార్తిక్ ఇంటి పక్కన ఐదు గంజాయి మొక్కలను పెంచుతున్నాడని, మెక్కలు పెరిగిన తరువాత అమ్ముకొని డబ్బు సంపాదించాలనుకున్నాడని ఎస్ఐ ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

కల్వర్టు పనులను అడ్డుకున్న గ్రామస్థులు



కోనరావుపేటలో కల్వర్టు పనులను అడ్డుకుంటున్న గ్రామస్థులు

కోనరావుపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి కల్వర్టు నిర్మాణం పనులను కోనరావుపేట గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. కల్వర్టు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిం చడంలేదని మండల కేంద్ర వాసులు ఆరోపిస్తున్నారు. పైపులు వేసిన తర్వాత కంకర సిమెంట్‌తో వేయాల్సి ఉండగా రౌతులు మట్టితో నింపుతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు సందర్శించి నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరారు.

గుంతలమయంగా కరీంనగర్-వరంగల్ రోడ్డు



మానకొండూర్‌లో గుంతలమయంగా కరీంనగర్-వరంగల్ రోడ్డు

మానకొండూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి గుంతలమయంగా తయారైంది. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలిచిపోవడంతో బస్సులు, లారీలు వెళ్లే సమయంలో ద్విచక్రవాహన దారులపై బురదనీరు పడుతోంది. చీకటి సమయంలో గుంతలు ఏర్పడకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు



సైదాపూర్ మండలం వెన్కేపల్లి సొసైటీ వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

సైదాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెన్కేపల్లి విశాల సహకార పరపతి సంఘానికి శనివారం యూరియా లోడ్ వస్తున్నదని తెలుసుకొని రైతులు పెద్దఎత్తున గోదాముకు చేరుకున్నారు. వర్షాన్ని సైతం లెక్క చేకుండా కవర్లు కప్పుకొని గోదామ్ ముందు యూరియా కోసం ఎదురు చూశారు. లోడ్ వచ్చిన వెంటనే రైతులను లైన్‌లో నిలబెట్టి వ్యవసాయధికారులు, సొసైటీసిబ్బంది ఒకొక్కరికి 2 బస్తాల చొప్పున పంపిణీ చేశారు. లోడ్‌లో 450బస్తాల యూరియా రాగా, చివరలో లైన్ నిలబడ్డ రైతులకు యూరియా అందక పోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

- బస్తాలు సరిపోవని పంపిణీ నిలిపివేత

శంకరపట్నం: మండలంలోని గద్దపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని కాచాపూర్ సొసైటీ సిబ్బంది వచ్చిన యూరియా బస్తాల లోడ్ కంటే రైతులు ఎక్కువగా ఉన్నారని పంపిణీ నిలిపివేశారు. మరుసటి రోజు మరొకలోడ్ వస్తుందని, రైతులకు నచ్చ చెప్పడంతో అక్కడి నుంచి వారు నిరాశతో వెనుతిరిగారు.

వరకట్నం కోసం వేధించిన భర్తపై కేసు

కోనరావుపేట ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం భార్యని వేధించిన భర్తపై కేసు నమోదు చేసినట్లు కోనరావుపేట ఎస్సై కే ప్రశాంత్‌రెడ్డి శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం కోనరావుపేట మండలంలోని అజ్మీర తండా గ్రామానికి చెందిన లకావత్ జ్యోతిర్మయి వివాహం 2018లో కొడిమ్యాల మండలం సూరంపేటకి చెందిన భూక్యా రమేష్‌తో జరిగింది. కొన్ని రోజుల నుంచి రమేష్ తన భార్య జ్యోతిర్మయినిఅదనంగా ఐదులక్షల రూపాయల వరకట్నం తీసుకరావాల్సిందిగా శారీరకంగా మానసికంగా వేధిస్తున్నాడు. శనివారం జ్యోతిర్మయి ఫిర్యాదు చేయడంతో రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అసంపూర్తిగా పీహెచ్‌సీ

- మూడేళ్లుగా పట్టించుకున్న నాథుడే లేడు
- ఇబ్బందుల్లో గ్రామప్రజలు
- గ్రామపంచాయతీ కార్యాలయంలో విధులు చేస్తున్న వైద్యసిబ్బంది

చిగురుమామిడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో గత ప్రభుత్వం హయాంలో నిర్మాణం చేపట్టిన పీహెచ్‌సీ భవనం అసంపూర్తిగా మిగిలింది. మండలంలో రెండో మేజర్ గ్రామ పంచాయతీ అయిన బొమ్మనపల్లిలో దాదాపు 5వేల మంది జనాభా ఉంటారు. ఎక్కువశాతం ప్రజలు ప్రభుత్వం అందించే వైద్యంపైనే ఆధారపడి ఉంటారు. సంబంధిత కాంట్రాక్టరు పీహెచ్‌సీ భవనాన్ని బేస్‌మెంట్ వరకు నిర్మించి వదిలేశాడు. నాటి నుంచి నేటి వరకు పనులు చేయలేదు. దీంతో ఉన్న నిర్మాణం కాస్తా శిథిలావస్థకు చేరింది. వైద్య సిబ్బందికి సరైన సదుపాయాలు లేక గ్రామపంచాయతీ కార్యాలయంలోని ఒక రూమ్‌లో విదులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పల్లే దవాఖానా సైతం ఇదే గ్రామ పంచాయతీలోనే ఏర్పాటు చేశారు. ప్రజలు వైద్యసేవలు పొందడానికి అనేక ఇక్కట్లు పడుతున్నారు. పీహెచ్‌సీ పరిస్థితిపై అనేక సార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో చర్చకు వచ్చినా ఎలాంటి ముందడుగు పడలేదు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ వెంటనే అసంపూర్తిగా ఉన్న పీహెచ్‌సీ భవన పనులు ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామప్రజలు, నాయకులు, మహిళా సంఘాలు కోరుతున్నాయి.



బొమ్మనపల్లిలో అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం



గ్రామ పంచాయతీ కార్యాలయంలో సేవలందిస్తున్న వైద్యసిబ్బంది(ఫైల్)

అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు..

- మిట్టపల్లి మల్లయ్య, మాజీ ఎంపీటీసీ,

గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే పనులను ఆపేశాడు. అప్పటినుంచి భవన నిర్మాణాన్ని పట్టించుకున్న వారే లేరు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నాయకులు స్పందించి భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

వినాయక మండపాల వద్ద

డీజేలను ఉపయోగిస్తే కఠిన చర్యలు

- సరస్వతీనగర్‌లో డీజేతో నృత్యాలు.. ఒకరి బైండోవర్
- కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి



రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వినాయకమండపాల వద్ద డీజేసౌండ్ వాడుతూ నృత్యాలు చేయటం, పాటలు పాడటం వంటిచేస్తూ వృద్ధులకు, చిన్నపిల్లలకు ఇబ్బందులను కలగిస్తే చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని కరీంనగర్‌రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సరస్వతీనగర్‌లో డీజేలతో నృత్యాలు చేసి స్థానికులకు ఇబ్బంది కలిగించిన ఫిర్యాదుతో నిర్వాహకుడిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అధిక స్థాయిలో కాలుష్యాన్ని సృష్టించే డీజేలు, భారీ సౌండ్‌సిస్టంల వినియోగం పూర్తి నిషేదమని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అధిక స్థాయిలో శబ్ధకాలుష్యానికి కారణమైన డీజేలు, సౌండ్ సిస్టంలు నిషేధమని, ఈ విషయంలో గణేష్ మండప నిర్వాహకులు పోలసులకు సహకరించాలన్నారు. గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపననుంచి వినాయక నిమజ్జనం వరకు డీజేలు, మైకులు ఉప యోగించకుండా నిబంధనలు పాటించాలన్నారు. పండుగల వేళ కరీంనగర్‌రూరల్ మండలంలోని రౌడీషీటర్లు కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతున్నామని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి వదంతులను, మెసేజ్‌లు(వాట్సాప్) నమ్మకూడదన్నారు.

ఇటువంటి వదంతులను వ్యాప్తి చేస్తూ సామాజికమాధ్యమాలలో పోస్టులు పెట్టే ఏస్థాయి వారైనా చర్యలు తీసుకుంటామన్నారు. వివాదాస్పద, అభ్యంతకరమైన పోస్టులు, వదంతులపై ఎవరికైనా సందేహాలు ఉంటే పోలీసులకు డయల్ 100కు సమాచారం అందించాలని సీఐ కోరారు.

ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు

● గోదావరిలో పెరిగిన ప్రవాహం ● ఎల్లంపల్లికి పోటెత్తుతున్న వరద


ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు


రామడుగు: గాయత్రి పంపుహౌజ్ నుంచి ప్రవహిస్తున్న నీరు

అంతర్గాం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తుతోంది. ఎగువన గల కడెం ప్రాజెక్టు, వాగులు, వంకలు ద్వారా వరద నీరు చేరుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పాటు కడెంప్రాజెక్టు 17గేట్లుఎత్తి లక్షా80వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెట్టారు. దీంతో రాత్రి 11గంటల సమయానికి ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 148.00మీటర్లకు గాను ప్రస్తుతం 147.24 మీటర్లకు నీరుచేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175టీఎంసీలు కాగా ప్రస్తుతం 18.063టీంఎసీల నీరు నిలువ ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 2,11,817క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టు అవుట్‌ఫ్లో 2,11,817 క్యూసెక్కులు ఉండగా, హైద్రాబాద్‌మెట్రో పాలిటన్ వాటర్‌స్కీం కోసం 286క్యూసెక్కులు, ఎన్టీపీసీ అవసరాలకు 121క్యూసెక్కులు, పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్ హౌజ్‌కు 9,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

● **కడెం గేట్లు ఎత్తివేత..**

కడెం రిజర్వాయర్‌కు ఉన్న18గేట్లలో 17గేట్లు తెరిచి 1,07,161 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పూర్తిస్థాయిలో నీరు చేరడంతో రాత్రి వరకు 20 గేట్లను ఎత్తి 2,01,960 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు

● **నంది పంప్‌హౌజ్ ద్వారా ఎత్తిపోతలు**

ధర్మారం: ఐదు రోజులుగా నంది మేడారంలోని నంది పంప్‌హౌజ్ ద్వారా ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. రోజు ఉదయం 7-30నుంచి సాయంత్రం 5-30 గంటల వరకు 3పంపుల ద్వారా 9450క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఏవైనా మార్పులు ఉంటే మినహా అనుకున్న షెడ్యూల్‌ప్రకారం ఆదివారం వరకు ఎత్తిపోతలు కొనసాగుతాయని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

● **గాయత్రి పంపుహౌజ్ నుంచి నీటి విడుదల**

రామడుగు: రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపు హౌజ్ శనివారం మూడు పంపుల ద్వారా వర్షాకాలానికి నీటిని విడుదల చేశారు. 9450క్యూసెక్కుల నీటివిడుదల చేయగా నేరుగా మధ్యమానేరుకు తరలి


నంది పంప్‌హౌజ్ ద్వారా నీటి తరలింపు

వెళ్తోంది. ఇప్పటివరకు రెండుటీఎంసీల నీటిని మిడ్‌మానేరుకు తరలించినట్లు తెలిపారు.

● **మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో**


బోయినిపల్లి : మండలంలోని శ్రీరాజరాజేశ్వర జలాశ యానికి ఎల్లంపల్లి జలాల ఎత్తిపోతలతో పాటు, మూలవాగు, మానేరు ద్వారా నీటీ ప్రవాహం కోనసాగుతోంది. ప్రాజెక్టులోకి శనివారం వరకు 12980 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గాయత్రి పంప్‌హౌజ్ నుంచి 11,000 క్యూసెక్కులు, మూల వాగు, మానేరుద్వారా 1,332క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతున్నట్లు ప్రాజెక్టు డీఈఈరాజు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటీమట్టం 318 మీటర్లకుగాను ప్రస్తుతం 308.96మీటర్లు, నీటి నిల్వసామర్థ్యం, 27.55 టీఎంసీలకు గాను 9.850 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

● **ఎల్‌ఎండీకి పెరుగుతున్న ఇన్‌ఫ్లో**

తిమ్మాపూర్: ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. 15వతేది రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో 16వతేది సాయంత్రానికి 1168క్యూసె క్కుల ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో ఎల్‌ఎండీలో ప్రస్తుతం నీటి నిలవు 7.252టీఎంసీలకు చేరింది. ఎల్‌ఎండీ పూర్తి నీటిసామర్థ్యం 24.034 టీఎంసీలు. మిషన్‌భగీరథ, ఆవిరి రూపంలో 219 క్యూసెక్కుల నీరు ఆవుట్‌ఫ్లో వెలుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

● కాకతీయ కాలువకు నీరు

గంగాధర: కాకతీయ కాలువకు కాళేశ్వరం నీరును విడుదల చేశారు. గాయత్రి పంపుహౌజ్ నుంచి మోటర్ల ద్వారా గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ వరదకాలువకు నీరును విడుదల చేశారు. నాలుగు రోజుల క్రితం రెండు మోటర్లను ఆన్ చేయగా శనివారం ఐదుమోటర్లతో నీటిని దిగువకు తరలిస్తున్నారు. శనివారం ఒక్క మోటర్‌ను నిలిపేసి నాలుగు మోటర్లతో నీటిని వరద కాలువకు తరలిస్తున్నారు. ప్రస్తుతం 15వేల క్యూసెక్కుల నీరు వరద కాలువకు విడుదలవుతోంది. కాళేశ్వరం నీరు నాగిరెడ్డిపూర్ వరద కాలువ నుంచి రివర్స్‌గా ఎగువకు తరలుతున్నాయి. ఇదే సమయంలో ర్యాలపల్లి వద్ద వరద కాలువపై ఏర్పాటు చేసిన లింక్‌ను తెరచి కాకతీయ కాలువకు నీరును విడుదల చేశారు. 900క్యూసెక్కుల నీరు మల్యాల మండలం తాటిపెల్లి సమీపంలోని కాకతీయ కాలువ నుంచి పెద్దపల్లికి తరలిస్తున్నారు. రైతులు పంటలకు నీరు విడుదల చేయాలని కోరడంతో నీటిని కాకతీయ కాలువకు విడుదల చేస్తున్నారు. గాయంత్రి పంపుల నుంచి నీరు విడుదల చేయడంతో గంగాధర మండలంలోని ర్యాలపల్లి, కొండయ్యపల్లి, బూరుగుపల్లి, నాగిరెడ్డిపూర్, కురిక్యాల, కొండన్నపల్లి, తాడిజెర్రి, రంగరావుపల్లి, గర్షకుర్తి, ఆచంపల్లి గ్రామాల ఆయకట్టుకు సాగు నీరు అందుతోంది. అరకొర వర్షాలతో ఆగమైన రైతులు వరద కాలువకు నీరు విడుదల చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ర్యాలపల్లి వరద కాలువ నుంచి కాకతీయ కాలువకు తరలుతున్న నీరు

● ధర్మపురి వద్ద ఉగ్రరూపం దాల్చిన గోదావరి

● కడెం ప్రాజెక్టు 17 గేట్లు ఎత్తి నీరు విడుదల


ధర్మపురి దిగువ భాగంలో రాయపట్నం వైపు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్న గోదావరి నది

ధర్మపురి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలో శనివారం గోదావరి నది ఉగ్ర రూపం దాల్చింది. గోదావరి ఎగువ మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరిలో నీరు చేరుతోంది. నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు చేరింది. దీంతో కడెం ప్రాజెక్టు సంబంధించిన 17 గేట్లు ఎత్తి అధికారులు దిగువ గోదావరి నదిలోకి నీటిని విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం పెరిగి ఉధృతంగా మారింది. రాయపట్నం పాత వంతెన నీటిలో మునిగి పోవటంతో అటు వైపు ప్రజలను వెళ్లనీయకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

శ్రీరాంసాగర్‌కు అత్యధికంగా వరద

● ప్రాజెక్టులోకి 1,04,879 క్యూసెక్కుల వరద

● ఒక్క రోజులో ఏడు టీఎంసీల నీరు


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ప్రస్తుత సీజన్‌లో అత్యధికంగా వరద నీరు వస్తోంది. శనివారం ఉదయం 89 క్యూసెక్కులకు పైగా వచ్చిన వరద, సాయంత్రం వరకు కొంత పెరిగి సుమారు 1,29,393 క్యూసెక్కుల వరకు వస్తోంది. కేవలం ఒక్క రోజు వ్యవధిలో డ్యామ్‌లో సుమారు ఏడు టీఎంసీలకు పైగా నీరు వచ్చి చేరింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం వరద నీరు రావడం భారీగా పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడం, విష్ణుపురి పరివాహక ప్రాంతం నుంచి గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 56.980 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 48.071 టీఎంసీల నీరు ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 46.930 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 8.937 టీఎంసీల నీటిని విడుదల చేశారు.

● **గోదావరి పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి**

ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల గోదావరిలో భారీగా వరద నీరు పెరిగే అవకాశం ఉన్నందున గోదావరి పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఆర్‌ఎస్‌పీ ఈఈ చక్రపాణి ఒక ప్రకటనలో కోరారు. పశువులు, గొర్రెల కాపర్లు, చేపలు పట్టే వారు, రైతులు, సామాన్య జనం గోదావరి దాటే ప్రయత్నాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..


కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారి ఉద్విని

ఆలయాల్లో శ్రావణ సందడి

ధర్మపురి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రావణసందడి నెలకొంది. శనివారం లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఉగ్రనరసింహ, వేంకటేశ్వర, రామలింగేశ్వరస్వామి, గణపతి ఆలయాల్లో ఉదయం ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు యమధర్మరాజు ఆలయం వద్దగండ దీపంలో నూనెపోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా, సోదరుడు, బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధి బిగాల మహేష్‌గుప్తా శనివారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవోసంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఉపప్రధానఅర్చకులు నేరెళ్లశ్రీనివాసా చార్యులు, ముఖ్యఅర్చకులు నంబి శ్రీనివాసాచారి,రమణాచార్య, నంబినరసింహమూర్తి, ద్యావళ్లవిశ్వనాథశర్మ పాల్గొన్నారు.


ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. శ్రావణ మాసం కావడంతో భక్తులు అంజన్నసన్నిధికి వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు ఇతర పూజలు చేశారు. వేకువజాము నుంచి వర్షం కురియడంతో భక్తులకు ఇబ్బందులు పడ్డారు.


కొండగట్టు ఆలయంలో భక్తులు

యూటర్న్ ఏర్పాటు చేయాలి


బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ శ్రేణులు

శంకరపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగట్టు గ్రామంలోని పంచాయతీ ముందు ప్రజల సౌకర్యార్థం యూటర్న్ ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు శనివారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సెల్‌ఫోన్ డ్రైవింగ్.. యమ డేంజర్

- మ్యూజిక్ వింటూ బైక్స్ నడుపుతున్న యువత
- అతివేగంతో రెప్పపాటులో ప్రమాదం
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడుపుతున్న సమయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఏకగ్రతతో డ్రైవింగ్ చేస్తే సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చు. అయితే ఏ వాహన చోదకుడిని చూసినా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడమే కనిపిస్తుంది. ఇంకొందరు ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని మ్యూజిక్ జోష్‌లో అతివేగంగా వాహనాలను నడుపుతున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల ప్రాణాలు గాలిలో కలుస్తున్నా యి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం వల్ల ఏకాగ్రత లోపించి ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. రాజన్న సరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 2024లో ఇప్పటి వరకు 288 రోడ్డు ప్రమాదాలు సంభవించగా 85మంది మృతిచెందగా 299మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఏడాది ఏడు నెలల్లో దాదాపు 212 రోడ్డు ప్రమా దాలు చోటుచేసుకోగా 40మందికి పైగా మృతిచెందారు. 162 మందికి పైగా గాయాలపాలయ్యారు. ఇందులో సెల్‌ఫోన్ మాట్లా డుతూ వాహనం డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారినపడిన వారు అనేకమంది ఉన్నారు.

● **ఇయర్ ఫోన్‌లో సంగీతం వింటూ..**

యువత ఇయర్‌ఫోన్‌ల ద్వారా మ్యూజిక్ వినే జోష్‌లో ద్విచక్రవాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. యువతను హోరెత్తించే రాకింగ్ మ్యూజిక్, మైమరిపించే పాటలు, ఎక్కువ డెసిబెల్స్‌లో శబ్దాలతో ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని రోడ్డుపై వాహనాలు నడుపుతూ వెనుక వచ్చే వాహనాలను పట్టించుకోవడంలేదు. ఇటీవల కాలంగా వాయిస్ క్యాన్సలేషన్ ఇయర్‌ఫోన్లు, హెడ్‌ఫోన్లు వాడకం పెరిగింది. వీటి ద్వారా బయట శబ్దాలు అసలు వినిపించవు. ఈ తరహా ఇయర్‌ఫోన్లు వాడుతూ రోడ్డు దాటడం, డ్రైవ్ చేయడం అత్యంత ప్రమాదకరం. మనచుట్టుపక్కన శబ్దాలు వినిపించక ప్రమాదాలు పొంచి ఉంటాయి. మరోవైపు ఇతరుల ప్రాణాలు పోవడానికి కారకులవుతున్నారు. చాలామంది వాహన చోదకులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ, ఇయర్ ఫోన్స్ పెట్టుకొని పాటలు వింటూ వాహనాలను నడుపుతున్నారు. ద్విచక్రవాహనదారులే కాకుండా ఆటోలు, కార్లలో పెద్ద సౌండ్స్‌తో పాటలు వింటూ డ్రైవింగ్‌చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.


వాహనాలను తనిఖీచేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

● **సెల్ హెల్మెట్‌లో పెట్టి మాట్లాడటం..**

హెల్మెట్‌లో సెల్‌ఫోన్ పెట్టుకొని మాట్లాడుతూ డ్రైవ్ చేస్తూ ప్రమాదాలకు మూలమవుతున్నారు. ద్విచక్రవాహనాలు నడిపే చాలా మంది హెల్మెట్‌లో సెల్‌ఫోన్ పెట్టుకొని ఇతరులతో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారు. హెల్మెట్‌లోపల చెవి దగ్గర సెల్‌ఫోన్ పెట్టుకోవడంతో పక్కనుంచి వచ్చే వాహనాల హారన్ వినడ పడక ప్రమాదాల బారిన పడుతున్నారు. పక్కన వచ్చే వాహనదారులతో గొడవకు దిగి బావోద్వేగానికి లోనైతే డ్రైవింగ్ మీద దృష్టిని మరల్చుతుంది. మరోవైపు మెడ వంచి చెవికి, భుజానికి మధ్యన సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపడం సాధారణమైపోయింది. ఈ విధమైన డ్రైవింగ్ ఏకాగ్రతను దెబ్బతీస్తుంది. కొందరు ఫోన్‌లు పట్టుకొని మెస్సెజెస్,చాటింగ్ చేస్తూ డ్రైవ్‌చేస్తుంటారు. మరోవైపు తింటూ డ్రైవ్ చేయడం, డ్రైవ్‌చేస్తూ సెల్ఫీ తీసుకోవడం ప్రమాదమని భావించాలి.

● **డ్రైవింగ్‌పై దృష్టిపెడితే క్షేమంగా గమ్యం**

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ క్షేమంగా గమ్యం చేరాలంటే డ్రైవింగ్‌పై ఏకాగ్రత అవసరం, చాలామంది సెల్‌ఫోన్ డ్రైవింగ్ పెద్ద తప్పుకాదులే అనుకుంటారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్‌కి సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్‌చేయడం ఏమి తీసిపోదని పోలీసులు వాహనాదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా స్టీరింగ్ చేతిలో ఉన్నప్పుడు ఫోన్ మాట్లాడననే నియమం పెట్టుకోవాలని చెపుతున్నారు. క్షేమంగా గమ్యం చేరాలి.. ఇతరులు క్షేమంగా గమ్యం చేరేలా వాహనాదారులు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు విస్తృత తనిఖీలు

- మహేశ్ బి. గీతే , ఎస్పీ , రాజన్న సిరిసిల్ల



రోడ్డు ప్రమాదాల నివారణకు తనిఖీలు చేపట్టాం. ప్రతి శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతాయి. డ్రైవింగ్ సమయంలో నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. యువత వాహనాలపై అతివేగంగా వెలుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మైనర్‌లకు వాహనం ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదుచేస్తాం. వాహనాలు నడుపుతుండగా సెల్‌ఫోన్ మాట్లాడవద్దు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

● వర్షంలోనూ రాజన్న దర్శనం కోసం బారులు

● ఆలయంలో ఘనంగా గోకులాష్టమి వేడుకలు


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజే శ్వరస్వామి వారి ఆలయంలో శ్రావణమాసం రద్దీ కొనసాగుతోంది. శనివారం ఉదయం వర్షంలోను భక్తులు రాజన్న ఆలయానికి పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కులు చెల్లించుకుని తిరుగు ప్రయాణమయ్యారు.

● **ఘనంగా గోకులాష్టమి వేడుకలు..**

గోకులాష్టమి సందర్భంగా ఉదయం 6.30గంటలకు అర్చకులు అన్ని వైష్ణవ దేవాలయాల్లో అభిషేకము, అర్చనలను ఘనంగా నిర్వహించారు. భీమేశ్వరస్వామి వారి ఆలయంలో మహాపూజ చేపట్టారు. రాత్రి ఎనిమిది గంటలకు స్వామివారి కల్యాణ మండపంలో ఉట్లు కొట్టుట, డోలోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజన్న ఆలయఈవో రాధాబాయి, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు తదితరులు హాజరయ్యారు. వేములవాడ పట్టణంలోని యాదవ్ యూత్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. యువకులు పెద్దసంఖ్యలో హాజరై ఉట్టికొట్టుటలో ఉత్సహంగా పాల్గొన్నారు.


ఆలయంలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న అర్చకులు

అభయ కృష్ణ ఆలయంలో మంత్రి అడ్లూరి పూజలు


మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో నాయకులు

ధర్మారం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తిపాక అభయ కృష్ణ ఆలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం గ్రామంలోని అభయ కృష్ణ ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అభిషేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, పత్తిపాక ప్యాక్స్ చైర్మన్ నోముల వెంకటిరెడ్డి, మాజీ ఎంపీటీసీ అజయ్‌పాల్ రెడ్డి, నర్సింగాపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఏదుల్ల అంజయ్య తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి


పొత్కపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ

ఓదెల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పొత్కపల్లి ఎస్సై రమేష్ అన్నారు. శనివారం నాషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మండలంలోని పొత్కపల్లిలో మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. పోలీస్ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కలశ యాత్రను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెజంగ్ల రజ్ కలశ యాత్రను విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్ తెలిపారు. యాదవ చారిటబుల్ ట్రస్ట్ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జాతీయ కమిటీ దేశవ్యాప్తంగా రెజంగ్ల రజ్ కలశ యాత్ర బీహార్‌లో ప్రారంభమై వివిధ రాష్ట్రాలలో కొనసాగిస్తూ ఈనెల 9న రాష్ట్రంలో ప్రవేశించిందన్నారు. ఈ యాత్ర 18న ఉదయం 10 గంటలకు పెద్దపల్లి జిల్లాలో ప్రవేశించి జెండా చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు కొనసాగుతుందన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఉన్న యాదవ కుల బాంధవులు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుపతి యాదవ్, రాజేందర్ యాదవ్, ఓదెల యాదవ్, పర్వతాలు యాదవ్, రాజం మహంత కృష్ణ, అట్ల సాగర్, మల్లెత్తుల నాగరాజు, బత్తిని లక్ష్మణ్, దారవేణి పోచం యాదవ్, పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు అరుదైన గౌరవం గర్వకారణం

మంథని, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్స్ ఇన్ ఏఐ-25 జాబితాలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు 7వ స్థానంలో నిలువడం గర్వకారణమని కాంగ్రెస్ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్‌జీ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. సమర్థవంతమైన న్యాయకత్వంతో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నారని, ఏఐ రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న వ్యక్తుల్లో మంత్రి శ్రీధర్‌బాబుకు చోటు దక్కడం హర్షణీయమని తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు

రామగిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి మహాత్మా జ్యోతిరాబాపూలే అవార్డుకు ఎంపికైన మండలంలోని కల్వచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న హిందీ పండిట్ మల్లారపు శంకర్‌ను శనివారం సన్మానించారు. హిందీ పండిట్‌గా, భారత స్కౌట్స్ అండ్‌గైడ్స్ జిల్లా శిక్షకుడిగా సేవలందిస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా నేషనల్ అవార్డు ఎంపికయ్యారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కొలిపాక సారయ్య, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతీ, మాజీ ఎంపీటీసీ కొట్టెసందీప్, రమణరెడ్డి, పింగిళి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకులు కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల రామక్రిష్ణారెడ్డి

సుల్తానాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అధికారాన్ని అడ్డుపెట్టుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని తెలుసుకోవాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి అన్నారు. సుల్తానాబాద్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెర వేర్చే విషయాన్ని ఆలోచించాలన్నారు. ప్రతిపక్ష పార్టీల పట్ల కక్ష సాధింపు చర్యలకే తమ కాలాన్ని వినియోగించడం వల్ల ప్రజలకు ఏం చేయలేకపోతున్నారన్నారు. కడారి అశోక్‌రావు, కన్నం అంజయ్య, జ్యోతిబసు, చాతరాజు రమేష్, నారాయణ స్వామి, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. రామక్రి ష్ణారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గుజ్జుల రామకృష్ణారెడ్డి జన్మదినం నిర్వహించారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. జనార్దన్ రెడ్డి, నిర్మల, మల్కోజు వెంకటేశ్వర్లు, చల్ల చంద్రమౌళి, కొక్కిస దేవేందర్ గౌడ్, రామగిరి మహేందర్ పాల్గొన్నారు.

పెద్దపల్లి టౌన్, (ఆంధ్రజ్యోతి): గుజ్జుల రామకృష్ణా రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. గజమాలతో సన్మానించి కేక్ కట్ చేయించారు. కందుల సంధ్యారాణి, పల్లె సదానందం, వెల్లంపల్లి శ్రీనివాస రావు, జంగా చక్రధర్ రెడ్డి, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ షట్ డౌన్‌పై ఆరా!

(5వ పేజీ తరువాయి)

లేదు. తరచూ సాంకేతిక అవరోధాలతో ప్లాంట్ షట్ డౌన్ అయి ఉత్పత్తి నిలిచి పోతుండడంతో సకాలంలో యూరియా సరఫరా కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలల కాలంలో మూడుసార్లు షట్ డౌన్ కావడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరి గణిస్తున్నది. జిల్లాలో పెద్దగా యూరియా కొరత లేకున్నప్పటికీ, ఇతర జిల్లాల్లో కొరత ఏర్పడింది. మరో 15 రోజుల్లో వరి పంట కలుపు తీసిన తర్వాత రెండో విడత యూరియా చల్లుతారు. రైతులు యూరియా కోసం సహకార సంఘాల వద్ద బారులు తీరుతున్నారు. కొరతను ఆసరా జేసుకుని ప్రైవేట్ వ్యాపారులు ఒక్కో యూరియా బస్తాను ఎమ్మార్పీ కంటే 30 నుంచి 40 రూపాయలు అదనంగా విక్రయిస్తున్నారు. షట్ డౌన్ అయిన ప్లాంట్‌లో తిరిగి ఉత్పత్తి చేపట్టేందుకు వారం, పది రోజులు పట్టే అవకాశాలున్నాయి. షట్ డౌన్ ఎందుకు అవుతుందనే విషయాన్ని తెలుసుకునేందుకు శనివారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ఆర్ఎఫ్‌సీఎల్‌ను సందర్శించారు. సీఈఓ అలోక్ సింగ్‌తో భేటీ అయ్యారు. తెలంగాణకు రావాల్సిన 50 శాతం కోటా యూరియాను తగ్గించి ఇవ్వడానికి గల కారణాలు, తదితర అంశాలపై చర్చించారు. అయితే ఆర్ఎఫ్‌సీఎల్‌లో నాణ్యత లేని అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీలతో ఉత్పత్తికి అవరోధం ఏర్పడుతున్నదని, దీనిపై సీబీఐచే కేంద్రం విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): అమ్మోనియా ప్లాంట్‌లో వరుస లీకేజీలకు ఎవరి బాధ్యత అని, తెలంగాణ రైతాంగాన్ని గోస పెడుతున్నారంటూ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం ఆయన ప్లాంట్‌ను పరిశీలించారు. ప్లాంట్ హెడ్ రమేష్ ఠాకూర్‌తో కలిసి ఆయన అమ్మోనియా లీకైన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అలోక్ సింఘాలతో భేటీ అయ్యారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం నిర్మిస్తే తెలంగాణ రైతాంగానికి యూరియా సకాలంలో అందుతుందని మూతపడిన ఎఫ్‌సీఐని పునరుద్ధరించి యూపీఏ ప్రభుత్వం కొత్త ప్లాంట్ నిర్మాణానికి క్లియరెన్స్ ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 11శాతం భాగస్వామిగా చేరిందన్నారు. ప్రస్తుతం అమ్మోనియా బాంబు కింద ఉన్నట్టు ఈ ప్రాంత పరిస్థితి ఉందన్నారు. ప్రాజెక్టులో ఉత్పత్తి అవసరాలకు మిషన్ భగీరథ నుంచి నీరు ఇస్తున్నామన్నారు. ఉత్పత్తిలో 50శాతం యూరియాను తెలంగాణకు ఇవ్వాల్సి ఉందన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచే ఈ సీజన్‌లో తెలంగాణకు 1.2లక్షల టన్నుల యూరియాను తగ్గించారన్నారు. ప్రాజెక్టులో నాసిరకంగా అమ్మోనియా పైప్‌లైన్ల నిర్మాణాలు జరిగి తరచూ లీకేజీ అవుతున్నాయని, ఈ ప్రాంత ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారన్నారు. నిర్మాణ లోపాలపై సీబీఐతో విచారణ జరిపించాలని లేఖ రాస్తానన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్‌కు ఒక రామగుండంలోనే ప్లాంట్ ఉందని, కేంద్ర కార్యాలయం ఢిల్లీలో ఉండడం వల్ల సకాలంలో నిర్ణయాలు జరుగడం లేదన్నారు. తాల్చేర్ కేంద్ర కార్యాలయాన్ని ఢిల్లీ నుంచి ఒడిశాకు తరలించారని, ఆర్ఎఫ్‌సీఎల్ కేంద్ర కార్యాలయాన్ని నోయిడా నుంచి రామగుండం తరలించాలన్నారు. ప్లాంట్‌ను వెంటనే మరమ్మతు చేసి తెలంగాణకు అత్యవసరంగా ఆగస్టు కోటా 65వేల టన్నులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో జీరో లెవల్ డిశ్చార్జ్(జెడ్ఎల్‌డీ) ప్లాంట్ నిర్మించి కాలుష్యం తగ్గించాల్సి ఉండగా నాలుగేళ్లుగా టెండర్ల పేర జాప్యాలు చేస్తున్నారన్నారు.

యూరియా రవాణాలో 30శాతం రోడ్డు మార్గంలో జరిగేలా చూడాలని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఆర్ఎఫ్‌సీఎల్‌కు సమీపంలో ఉన్నందున లారీల ద్వారా రవాణా పెంచి స్థానిక లారీ యజమానులకు ఉపాధి కల్పించాల న్నారు. అలాగే వీర్లపల్లిని తరలించాలని, ఆర్అండ్ఆర్ కల్పించాలన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం సీఎస్ఆర్ కింద రూ.20కోట్లు ఈ ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. ఈ మేరకు సీఈఓ అలోక్ సింఘాల్‌కు వినతిపత్రం అందించారు. డీజీఎం(హెచ్ఆర్) సోమనాథ్, కాంగ్రెస్ నాయ కులు మహంకాళి స్వామి, ఆసిఫ్, గట్ల రమేష్, నెలకంటి రాము, రాజ్‌కు మార్, కందుల సతీష్, కొక్కిరాల శ్రీనివాసరావు, ముస్తాఫా పాల్గొన్నారు.



బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచుకోవాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి జీఎం చిలుక శ్రీనివాస్

గోదావరిఖని, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, అధికారులు సమిష్టి కృషితో బొగ్గు ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచుకోవాలని ఆర్జీ-1 ఇన్‌చార్జి జీఎం చిలుక శ్రీనివాస్ అన్నారు. శనివారం జీడీకే ఓసీపీ-5లో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సంస్థ పురోభివృద్ధికి సాధించాల్సిన అంశాలను వివరించారు. షావల్స్, డంపర్లు, డోజర్లు వినియోగంలోకి తీసుకువచ్చి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని అధికారులకు సూచించారు. యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించినప్పుడే బొగ్గు ఉత్పత్తిని సాధించవచ్చునన్నారు. బొగ్గు రవాణా, నెలవారీగా నిర్దేశించిన ఉత్పత్తికి సంబంధించిన ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, ఏజీఎం అంజనేయులు, అధికారులు రమేష్‌బాబు, రమేష్, అనీల్ గబాలే, రవీందర్‌రెడ్డి, పొనగోటి శ్రీనివాస్, గుర్రం ప్రభుదాస్‌పాల్గొన్నారు.

ఉద్యోగుల పనితీరు మెరుగుపడాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య సూచించారు. మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాల్లో భాగంగా శనివారం జీఎం ఆఫీస్ సిబ్బందితో సమావేశమయ్యారు. అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సింగరేణి స్థితిగతులు, ఉత్పత్తి, రవాణా, బొగ్గు మార్కెట్‌లో ఎదురవుతున్న సవాళ్లను వివరించారు. జీఎం మాట్లాడుతూ విధులకు సకాలంలో హాజరు కావడం, పూర్తి పని గంటలు సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. మల్టీడిపార్ట్‌మెంట్ బృందం సభ్యులు సంతోష్‌కుమార్, సృజన్‌మెహ్రా, అరవిందరావు, మురళీకృష్ణ, వెంకటరామచంద్ర, ఎస్వోటూ జీఎం రాముడు, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్‌తో పాటు జీఎం ఆఫీస్‌లో వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఓసీపీ-1 బేస్‌వర్క్‌షాప్‌లో జరిగిన మల్టీడిపార్ట్‌మెంట్ సమావేశంలో కమిటీ చైర్మన్ రామ్మోహన్ మాట్లాడారు. బేస్‌వర్క్‌షాప్ ఉద్యోగులు యంత్రాల నిర్వహణ సకాలంలో సమర్థవంతంగా చేయడం ద్వారా యంత్రాల జీవిత కాలం పెరిగి మెరుగైన ఫలితాన్ని ఇస్తాయన్నారు. పీఓ రాజశేఖర్, అధికారులు శేఖర్‌బాబు, సుదర్శన్, చంద్రశేఖర్, విక్రం, ఉదయ్‌భాస్కర్, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు నక్క రమేష్, జక్కుల దామోదర్‌రావుతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ ట్రస్ట్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

గోదావరిఖని, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రధానకార్యాలయంలో శనివారం ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు చెందిన 4 ట్రస్టీలకు సంబంధించిన సమావేశాలు నిర్వహించారు. సీఎండీ ఎన్‌బలరాం హాజరయ్యారు. గత ఆర్థిక సంవత్సరం సంబంధించిన ఆర్థిక లావాదేవీల రిపోర్ట్ ఆమోదించారు. ఉద్యోగుల కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్‌మెంట్ మెడికేర్ స్కీమ్ అంశంపై సమీక్ష నిర్వహించారు. మారిన ట్రస్టు సభ్యుల స్థానంలో కొత్త సభ్యులను ఆమోదించి అనంతరం సీపీఆర్ ఎంఎస్-ఎన్ఈ ట్రస్ట్ కు సంబంధించి కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలను తీసుకొన్నారు. గుర్తింపు సంఘం ప్రెసిడెంట్ వి.సీతారామయ్య మాట్లాడుతూ సీపీఆర్ఎంఎస్ కార్డులను కలిగి ఉన్న వారికి సకాలంలో వైద్యం అందించాలని కోరారు. పదవీ విరమణ పొందే ఉద్యోగులు వారి పదవీ విరమణ రోజునే సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ మెడికల్ కార్డును ఇవ్వాలని కోరారు. గ్రాట్యుటీ, ఈడీసీపీఎస్ అంశంపై సమీక్షించారు. డైరక్టర్(పా) గౌతమ్ పొట్రు, డైరక్టర్(ఈఎం) డీ సత్యనారాయణరావు,డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ, డైరక్టర్(పీపీ) కే వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ కే రాజ్‌కుమార్, సీఎంఓఏఐ ప్రెసిడెంట్ టి.లక్ష్మిపతిగౌడ్, జీఎం(పర్సనల్) వెల్ఫేర్ సీఎస్ఆర్ జీవీ కిరణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

డిపెండెంట్‌లకు సూటబుల్ జాబ్ ఇవ్వాలి

గోదావరిఖని, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): డిపెండెంట్లకు సూటబుల్ జాబ్ ఇస్తామని ఒప్పుకొని రెండు సంవత్సరాలు గడిచిందని, ఇంత వరకు సూటబుల్ జాబ్ ఇవ్వకుండా వారిని మానసికంగా వేధింపులకు గురి చేయడం దుర్మార్గమైన చర్య అని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి వైవీ రావు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ 2023జూలై 25న రెండవ షిఫ్టులో అడ్రియాల ఏరియా పరిధిలో ఉన్న అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టు మైన్‌లో జరిగిన ప్రమాదంలో బూర్ల సారయ్య అనే కార్మికుడు మరణించాడు. అప్పటి ఏపీఏ జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు సారయ్య కుమారుడికి సూటబుల్ జాబ్ ఇస్తామని ఒప్పుకొన్నాడని గుర్తు చేశారు. ఇప్పటికీ రెండు సంవత్సరాలు గడిచినా యాజమాన్యం సూటబుల్ జాబ్ ఇవ్వలేదని ఆయన ఆరోపించారు.

జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇండ్లు ఇప్పిస్తా

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాలు, ఇండ్ల కోసం పోరాడుతున్న జర్నలిస్టుల సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శనివారం క్యాంపుకార్యాలయంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీడబ్ల్యుజేఎఫ్, పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఎమ్మెల్యేను కలిసి జాబితాతో కూడుకున్న వినతిపత్రాన్ని అందజేశారు. జర్నలిస్టు ప్రతినిధులు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా ఇళ్ల స్థలాలు, ఇండ్ల కోసం పోరాటం చేస్తున్నామని, గత ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి కలెక్టరేట్ సమీపంలో 5 గుంటల భూమిని ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను గుర్తించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇస్తామని, స్థలం ఉన్న జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫోన్ చేసి ఇంటి స్థలాలు ఇచ్చేందుకు భూములను గుర్తించాలని సూచించారు. అలాగే ప్రైవేటు విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ దరఖాస్తును పరిష్కరించాలన్నారు.

ఆర్థిక సహాయం

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మరణించిన నిరుపేద కుటుంబానికి వెలుగు సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సహాయం అందించింది. చంద్రబాబుకాలనీకి చెందిన కల్లెపల్లి కొమరమ్మ దశదినకర్మకు శనివారం వెలుగు సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ సురభి శ్రీధర్ 26 కిలోల బియ్యం అందించారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యం

అంతర్గాం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నదని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం కుందనపల్లి, పెద్దంపేట గ్రామాల్లో కల్యాణ లక్ష్మి చెక్కులు, కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. గృహజ్యోతి, మహాలక్ష్మి, సన్నబియ్యం పంపిణీ, రైతు భరోసా పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. తహసీల్దార్ తూము రవీందర్ పటేల్, ఎంపీడీఓ వేణు మాధవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి, కాంగ్రెస్ నాయకులు ఉరిమెట్ల రాజలింగం, పెండ్యాల మహేష్, సింగం కిరణ్ గౌడ్, నాజియా సుల్తానా, శేఖర్, స్వామి, రవీందర్ పాల్గొన్నారు.

చైతన్యపురి కాలనీని ముంచెత్తిన వరద


రహదారిపై పారుతున్న వరద

మంథని, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని చైతన్యపురి కాలనీని వరద నీరు ముంచెత్తింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షంతో కాలనీ చుట్టూ నీరు చేరి చెరువు, కుంటలను తలపిస్తుంది. కాలనీకి వెళ్ళే రోడ్డు పై మోకాలి లోతులో వరద నీరు ప్రవహిస్తోంది. కాలనీలో డ్రైనేజీలు లేకుండానే సీసీ రోడ్డు నిర్మించారు. డ్రైనేజీలు లేకపోవడంతో ఇండ్ల చుట్టూ వరద నీరు చేరి నిల్వ ఉంటుంది. నిల్వ నీటిలో దోమలు పెరిగి కాలనీ వాసులు అనారోగ్యానికి గురవుతున్నారు. వర్షా కాలంలో ఇలాంటి పరిస్థితితే ఉంటుందని కాలనీ వాసులు వాపోతున్నారు. డ్రైనేజీ ఏర్పాటు చేసి నీరు నిల్వ కుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతు న్నారు. బీజేపీ నేతలు సంతోష్, కొమురయ్య, అశోక్‌లు పరిశీలించారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు


వాలీబాల్ ఎంపిక పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

జ్యోతినగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం ఎన్టీపీసీ టీటీఎస్ జెడ్పీ స్కూల్ మైదానంలో జిల్లాస్థాయి అండర్ 15, 17 బాల, బాలికల వాలీబాల్, ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు జరిగాయి. పోటీలలో జిల్లాలోని వివిధ ప్రాంతాల పాఠశాలల నుంచి 62 మంది వాలీబాల్, 32 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులను రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ తెలిపారు. పీఈటీఏ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.శోభారాణి, ఎండి.జావెద్, విష్ణు, పాల్గొన్నారు.

కృష్ణం వందే జగద్గురుమ్...

- వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు


ఖనిలో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం గోదావరిఖనిలో ఘనంగా జరిగాయి. మార్కండేయకాలనీలోని మురళీ కృష్ణ ఆలయంలో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆలయం ముందు ఉట్టికొట్టే కార్యక్రమాలు జరిగాయి. శ్రీకృష్ణ నామస్మరణలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. మార్కండేయకాలనీలో శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో ఊరేగింపుగా మార్కండేయ కాలనీ చౌరస్తా నుంచి లక్ష్మీనగర్ తదితర పురవీధుల గుండా కృష్ణ నామా సంకీర్తనలతో కొనసాగింది. మాణిక్ ప్రభుజి, అజయ్, వంశీ, బాలా త్రిపుర సుందరీ, రాజేష్, మోహన్, పాల్గొన్నారు. పలు కాలనీల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కృష్ణుని వేషధారణతో సందడి చేయగా, పలువురు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి తిలకించారు. సుల్తాన్‌పూర్‌లోని ప్రగతి విద్యామందిర్, ధూళికట్టలోని గాయత్రి విద్యామందిర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి పండుగ పురస్కరించుకుని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాది పూజలలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం వాడ వాడలా ఉట్టి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు యువత వృద్ధులు అందరూ పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.


వేషధారణలో చిన్నారులు

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి పంచ ముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని గోపూజ నిర్వహించారు. ధర్మాచార్యులు నరెడ్ల సదయ్య, ఆలయ పూజారి వల్లూరి మహేష్ శర్మ పాల్గొ న్నారు. ఆరెల్లి సుజాత రమేష్, గుడిపాటి మనోహర్ రెడ్డి, జంగా తిరుపతిరెడ్డి, సదా రెడ్డి, మూల రాజరెడ్డి, పత్తి రంజిత్ రెడ్డి, పాల్గొన్నారు.


మంథనిలో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణుల విగ్రహాలు

మంథని, (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి వేడుకలను మంథనిలో వివిధ ఆలయాల్లో, ఇండ్లలో, పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. గోపి జనవల్లభ ఆలయంలో రాధాకృష్ణుల విగ్రహాలను, లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, భజన కార్యక్రమాలు చేశారు. సరస్వతి శిశుమందిర్‌లో, పాఠ శాలల్లో రాధాకృష్ణుల వేషధారణలో సాంస్కృతిక, ఉట్టి కొట్టె కార్యక్రమాలు అందరిని అలరించాయి. బోయినిపేట బలవీర హనుమాన్ ఆలయంలో భక్తులు ఏకాహం నిర్వహించారు.

ఫంక్షన్‌హాళ్ల దోపిడీ

- ఒక్క రోజుకే రూ.60 వేల నుంచి లక్షన్నర వరకు వసూలు
- పెళ్లి మండపం నుంచి అన్నీ అదనమే... అందులోనూ కమీషన్లే...



మార్కండేయకాలనీ, ఆగస్టు 16(ఆంధ్ర జ్యోతి): ఏ ఫంక్షన్ చేయాలన్నా ప్రస్తుతం ఫంక్షన్ హాల్ తప్పనిసరైంది. గతంలో ఇండ్లలో శుభకార్యాలు చేసే వారు. బంధువులు సహకరించేవారు. ప్రస్తుతం ఇండ్లు చిన్నగా ఉండడం, అందరూ బీజీగా ఉండడంతో శుభకార్యాలన్నీ ఫంక్షన్ హాల్‌లో జరుపుతున్నారు. అందుకు అనుగుణంగా ఏసీ, నాన్ ఏసీ, బంకెట్ హాల్‌లు ఏర్పాటయ్యాయి. అయితే ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని ఫంక్షన్ హాల్ నిర్వాహకులు అధిక మొత్తం వసూలు చేస్తున్నారు.

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఫంక్షన్ హాళ్ల దోపిడీ పెరిగిపోయింది. ఏ చిన్న ఫంక్షన్ చేయాలన్నా ఖర్చులు తడిసిపోపెడవుతున్నాయి. ఎన్టీపీసీ, గోదావరిఖని ప్రాంతంలో సుమారు 50 ఉన్నాయి. వీరంతా సిండికేట్‌గా మారి ఏ, బీ, సీ క్యాటగిరిలుగా విభజించుకున్నారు. చిన్న ఫంక్షన్‌హాల్స్‌ను సీ క్యాటగిరిగా, మధ్య స్థాయిలో ఉన్న వాటిని బీగా, పెద్ద ఫంక్షన్‌హాల్ హాల్స్‌ను ఏగా ప్రకటించుకుని వసూళ్లకు పాల్పడుతున్నారు. సీ క్యాటగిరి ఫంక్షన్ హాల్‌కు రూ.60వేలు వసూలు చేస్తుండగా, ఏ క్యాటగిరికి రూ.1.5లక్షల వరకు వసూళ్లు చేస్తున్నారు. ఇది కేవలం ఒక రోజు ఫంక్షన్‌హాల్ అద్దె మాత్రమే. మి గితా అన్నింటికి అదనపు వసూళ్లే. స్టేజ్ డెకరేషన్, విద్యుత్ చార్జి, కూలర్ల ఏర్పాటు, క్లీనింగ్ ఇలా వేర్వేరుగా వసూలు చేస్తున్నారు. వీటికి తోడు స్టేజి డెకరేషన్‌లో 20శాతం కమీషన్ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు వసూలు చేస్తుండడంతో వాటి ధరలు కూడా భారీగా పెరిగాయి. దీంతో ఇతరులు స్టేజ్ డెకరేషన్ చేయడం లేదు. ప్రస్తుతం శుభ ముహూర్తాలు ఉండడంతో ఫంక్షన్‌హాల్స్ డిమాండ్ పెరిగింది. ఫంక్షన్‌హాల్స్‌పై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ధరలపై నియంత్రణ లేకపోవడంతో నిర్వాహకుల ఇష్టారాజ్యంగా మారింది. ఫంక్షన్‌హాల్స్ ధరల నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సామాన్యులపై భారం...

- మెంటం ఉదయ్ రాజ్, జవహర్‌నగర్



రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఫంక్షన్‌హాల్స్ బంకెట్ హాల్స్ అద్దె ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. వివాహాది శుభకార్యాలకు వెచ్చించే మొత్తంలో సగం ఈ ఫంక్షన్‌హాల్స్ అద్దె, డెకరేషన్‌లకే వెచ్చించాల్సి వస్తుంది. నిర్వాహకులు సిండికేట్‌గా మారారు. ఫంక్షన్‌హాల్స్ ధరల నియంత్రణపై అధికారులు చర్యలు చేపట్టాలి.

ఫంక్షన్‌హాల్స్ ఆర్థిక దోపిడిని అరికట్టాలి

- శనిగరపు చంద్రశేఖర్



రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఫంక్షన్‌హాల్స్ ఆర్థిక దోపిడి మితిమీరుతుంది. పారిశ్రామిక ప్రాంతం పూర్తిగా కార్మికవాడలతో నిండి ఉండడంతో ఏదైనా ఫంక్షన్ చేయాలంటే తప్పకుండా ఫంక్షన్‌హాల్‌ను ఆశ్రయించాల్సి వస్తుంది. దీన్ని ఆసరాగా చేసుకుని ఇష్టం వచ్చిన రేట్లతో జేబులు గుళ్ల చేస్తున్నారు.